క్లుప్తంగా

సురక్షితమైన తాగునీరు అందించండి..

సత్తుపల్లిటౌన్: పైప్‌లైన్ లీకేజీలు, చేతిపంపుల మరమ్మతు విషయమై అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ డీఈఈ కె.జయలక్ష్మి సూచించారు. సత్తుపల్లిలోని కార్యాలయంలో పెనుబల్లి మండల తాగునీటి సహాయకులకు శుక్రవారం శిక్షణ ఇవ్వగా ఆమె మాట్లాడారు. చిన్నచిన్న మరమ్మతులు చేసేలా సహాయకులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ వినోద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రేంజర్ స్నేహలత, అధికారులు

సత్తుపల్లి: అడవులతో పాటు వన్యప్రాణులను సంరక్షించటం అందరి బాధ్యత అని సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ పి.స్నేహలత అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి నుంచి రేగళ్లపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పిచ్చేశ్వరరావు, ఎఫ్‌ఎస్‌ఓలు నర్సింహ, అరుణ్, వేణు, నాగరాజు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..



నగదు అందిస్తున్న మెకానిక్‌లు

సత్తుపల్లిటౌన్: ఇటీవల ఖమ్మంలో వచ్చిన వరదల కారణంగా బాధితులకు సత్తుపల్లి టూవీలర్ మెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం టూవీలర్ మెకానిక్స్‌కి రూ.35,700 శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, భాస్కర్, సుభాని, వాహిద్, నాగరాజు, నవీన్, వంశీ పాల్గొన్నారు.

తాగునీటి పథకాలకు బోర్లు, మోటార్లు వితరణ



భీమవరంలో విద్యుత్ మోటారు ఏర్పాటు చేసిన దాత పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, అయ్యవారిగూడెం, భవానీపురం గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్వహణకు గానూ భీమవరం గ్రామానికి చెందిన దాత, కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి రూ. 4.80లక్షలతో బోర్లు, విద్యుత్ మోటార్లు, పైపు లైన్ ఏర్పాట్లు నిర్వహించారు. దీంతో దాత పూర్ణచంద్రారెడ్డిని పార్టీ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి అభినందించారు.

పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయాలి

చింతకాని: ఈ నెల 21న ఖమ్మం నగరంలో జరగనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా నాయకుడు మస్తాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగులవంచలో కళాశాల విద్యార్థులతో పదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్య, విద్యార్థుల సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ 50 ఏళ్లుగా సమరశీల పోరాటాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని నిత్యం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ సభకు మేధావులు, విద్యార్థులు, ప్రగతిశీలవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మణికంఠ, శివ, సాయివర్ధన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తాపడిన సుబాబుల్ ట్రాక్టర్

మధిర: మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో సుబాబుల్ లోడుతో ఉన్న ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రక్‌లో ఉన్న సుబాబుల్ మొద్దులన్నీ షాప్ వద్ద పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామాల్లో సుబాబుల లోడుతో ఉన్న ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జనావాసాల మధ్య కూడా ఇదే మితిమీరిన వేగంతో టాక్టర్లు ప్రయాణించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాక్టర్ యజమానులపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘గృహజ్యోతి’ వెలుగులు

- మండలంలో 12,350 విద్యుత్ మీటర్లు..
- జీరో బిల్లులతో పేదలపై తగ్గిన భారం
- 200 యూనిట్లలోపు వారే ఎక్కువ శాతం
- దరఖాస్తులకు మండల పరిషత్‌లో ప్రజాపాలన ప్రత్యేక కౌంటర్



మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రత్యేక కౌంటర్



తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్ విద్యుత్ మీటర్

తల్లాడ: తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా నిరుపేదలు విద్యుత్ వెలుగులు పొందుతున్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం దారులకు ఉచిత కరెంట్ అందిస్తోంది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. గతంలో కరెంట్ బిల్లులు చెల్లించలేక అనేక మంది విద్యుత్ కనెక్షన్లు అర్థాంతరంగా కట్ చేసేవారు. మళ్లీ అపరాధ రుసుముతో అప్పు.. సప్పు చేసి ఆ బిల్లులు కడితే కరెంట్ సరఫరాను పునరుద్ధరించేవారు. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది బిల్లుల కోసం పదే పదే తిరగాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వమే 200లోపు యూనిట్ల వాడకం దారులకు ఉచిత విద్యుత్ నందిస్తుంది.

పేద కుటుంబాలకు లబ్ధి..

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చడానికి ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టింది. తెల్ల రేషన్ కార్డు కల్గి ఉన్నవారు, తక్కువ విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. అద్దెకుంటున్న వారికి ఆ యజమాని నుంచి ధృవీకరణ పత్రాలను అందజేస్తే అట్టి మీటరుకు పథకం వర్తిస్తుంది.

మండలంలో 12,350 కనెక్షన్లు..

మండలంలో 12,350 విద్యుత్ కనెక్షన్లకు వర్తిస్తుంది. తల్లాడ, కుర్నవల్లి విద్యుత్ సెక్షన్ల పరిధిలో విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.64 లక్షలుండగా ప్రస్తుతం రూ.23 లక్షల వరకు డిమాండ్ ఉన్నది. జీరో బిల్లులు రావడం వల్ల విద్యుత్ బిల్లుల వసూళ్ల మొత్తం తగ్గింది. మండలంలో తల్లాడ, కుర్నవల్లి, మిట్టపల్లి సబ్ స్టేషన్లు ఉన్నాయి. తల్లాడ, కుర్నవల్లి సెక్షన్లు ఉన్నాయి. ఈ రెండు సెక్షన్లకు ఇద్దరు ఏఈలు ఉన్నారు.

మండల పరిషత్‌లో ప్రత్యేక కౌంటర్..

గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారి కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రజా పాలన కౌంటర్‌లో 200 యూనిట్లులోపు విద్యుత్ వాడుకుంటూ అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. తెల్ల రేషన్ కార్డు, విద్యుత్‌బిల్లు, ఆధార్ కార్డ్ వంటి నకలు ప్రతులను జతచేసి ఈ కౌంటర్‌లో ఇవ్వాలి. అర్హులైన వారికి జీరో బిల్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి గృహజ్యోతి..



పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి గృహజ్యోతి పథకం తోడ్పడుతుంది. ఇంతకు ముందు కరెంట్ బిల్లులు కట్టలేక నానా అవస్థలు పడేవాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో ప్రతి కుటుంబంలో ఉచిత కరెంట్ అందుతోంది.

– గోవింద్ శ్రీనివాసరావు, అన్నారుగూడెం

ఎంతో ఉపయోగం..



తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి కుటుంబాలకు ఆర్థికంగా దోహదపడుతుంది. తెల్లరేషన్ కార్డు కల్గిన మాకు ఉచితంగా 200 యూనిట్ల లోపు విద్యుత్ సరఫరా చేయటం అభినందనీయం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు తెలంగాణా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుంది.

– యన్నం శ్రీలక్ష్మి, గృహిణి, రామానుజవరం

టీఎన్జీవోస్ కమిటీల ఎన్నిక



వైరా యూనిట్ కమిటీ



సత్తుపల్లి కార్యవర్గంతో నాయకులు



కల్లూరు యూనిట్ కార్యవర్గం

వైరా/తల్లాడ/సత్తుపల్లిరూరల్: టీఎన్జీవోస్ వైరా యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు శుక్రవారం జరిగిన ఎన్నికలకు గుర్రం ధనలక్ష్మీ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా అధ్యక్ష, కార్యదర్శులుగా తన్నీరు ప్రవీణ్, దొండ అనంతరాములు, కోశాధికారిగా గుగులోత్ వాల, సభ్యులను ఎన్నుకున్నారు. ఇక కల్లూరు యూనిట్ టీఎన్జీవోస్ కార్యవర్గ ఎన్నికలు తల్లాడలో నిర్వహించగా ఏకగ్రీవమైంది. జి.భాస్కర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్త పెద్ద పుల్లయ్య, జి.విజయ్‌కుమార్, కోశాధికారిగా వి.వెంకటరమణతో పాటు సభ్యులు ఎన్నికైనట్లు ప్రకటించారు. అలాగే, టీఎన్జీవోస్ సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా చింతకాయల కృష్ణ, చీకటి చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో పి.లక్ష్మీనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారిగా పగిడిపల్లి అయోధ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గాలను జిల్లా కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, నాయకులు పి.రామయ్య, జయపాల్, దుర్గాప్రసాద్, లలితకుమారి, గుంటుపల్లి శ్రీనివాస్, రాధాకృష్ణ, రామారావు, బాలకృష్ణ, భద్రమ్మ, శ్రీకర్, రోజా, కరుణకుమారి, పద్మ, జయకుమారి, ఎస్.ప్రకాష్‌రావు, వై.రమేష్, విజయ్, బజ్జూరి వెంకటేశ్వరరావు, బి.రాములు, దర్గాభి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైరారూరల్: మండలంలోని అష్ణగుర్తి, రెబ్బవరం గ్రామాల్లో శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అష్ణగుర్తి రామాలయంలో రూ.10 లక్షల టీటీడీ నిధులతో నిర్మించే మండపానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అంతకుముందు రెబ్బవరంలో ఓ ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, అష్ణగుర్తి, రెబ్బవరం మాజీ సర్పంచ్‌లు కోటేశ్వరరావు, మురళి, దానియేలు, కళావతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా అబ్దుల్ మజీద్



అబ్దుల్ మజీద్

ఏన్కూరు: పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా ఎస్‌కె అబ్దుల్ మజీద్ ఎంపికయ్యారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన పీఆర్‌టీయూ నూతన కమిటీ సమావేశంలో.. ఏన్కూరు మండలంలోని మేడేపల్లిపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె మజీద్‌ను కార్యదర్శిగా, ఎర్రబొడు తండాలో విధులు నిర్వహిస్తున్న జి.రమేష్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారిని మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతా రాజు, బత్తుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా నెహ్రూ



కారేపల్లి: నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ రవిప్రసాద్

కారేపల్లి: కారేపల్లిలో ఎంపీడీఓ రవిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సింగరేణి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా నెహ్రూ, జనరల్ సెక్రటరీగా హరి, ఉపాధ్యక్షుడిగా మద్దెల వెంకటేష్, కోశాధికారిగా కొత్తపల్లి అనూష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెండ్ర అనీల్ కుమార్, గౌరవ సలహాదారులుగా కొండపల్లి అనీల్ కుమార్, కె.రామకృష్ణలను ఎన్నుకున్నారు.

కేసు నమోదు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన తుపాకుల శంకరరావుపై దాడికి పాల్పడిన అన్నెం రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బనిగండ్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో అన్నెం రాంబాబు, తుపాకుల శంకర్‌రావుల మధ్య గత కొంతకాలంగా.. భూమి వివాదం ఉంది. కాగా శుక్రవారం ఉదయం ఇరువురి మధ్య మరోసారి గొడవ జరగ్గా.. శంకర్‌రావు తలకు తీవ్రంగా గాయమైంది. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు

6న ఉచిత వైద్య శిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

సత్తుపల్లి: సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన పట్టణం లోని కేపీఆర్ స్కూల్‌లో ఈ నెల 6వ తేదీన ఉచిత వినికిడి వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు లయ న్స్‌క్లబ్ నిర్వాహకులు దారా కృష్ణారావు తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి కళాభారతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన ఎనిమిది మంది వైద్యులు, నలుగురు సాంకేతిక సిబ్బందితో ఈ శిబిరం నిర్వహించబడుతుందని తెలిపారు. ఇందులో ఎంపిక చేసిన 10 సంవత్సరాలలోపు పిల్ల లకు రూ.30 లక్షల వరకు ఖర్చు అయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేయబడతాయని తెలిపారు. సమావేశంలో సోమిరెడ్డి, అప్పారావు, రమేష్, ఉమా మహేశ్వరరెడ్డి, జి.రవి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బోనకల్: బీజేపీ మతోన్మాద విధానం దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని తూటికుంట్ల గ్రామంలో శుక్రవారం పార్టీ మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన తాళ్ళూరి రత్తయ్య సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించారన్నారు. గ్రామంలో ఎంతోమంది పోరాట యోదులు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగిపోతుందన్నారు. సీతారాం ఏచూరి మరణం పార్టీకి, ప్రజలకు తీరని నష్టమన్నారు. పేద ప్రజలకు అవసరమయ్యే అనేక చట్టాలను తీసుకురావడంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, పాపానేని రామనర్సయ్య, బందం శ్రీను, గుగులోతు పంతు, కంకణాల సౌభాగ్యం, గుమ్మా ముత్తారావు, రమేష్, కోటి పాల్గొన్నారు.

వెంగన్నపేటలో ఉచిత పశువైద్య శిబిరం

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. పశు సంవర్ధక శాఖా ఆధ్వర్యంలో గోపాలమిత్ర పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 31 పశువులను పశువైద్యాధికారి నిషి జోషి పరీక్షించి గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. గెదె దూడలకు నట్టల మందు తాగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.నాగభూషణం, వెం.వెంకటేశ్వరరావు, జేవీఓ నాగరాజు, చొక్కారావు, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రావు, రమేష్, దాసు, బాబురావు, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తూ చిత్తూల బొమ్మ..

తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా భావించే పూల పండుగ బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు మండలాల్లోని పలు గ్రామాల్లో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తరలివచ్చి బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువు, సాగర్ కాల్వల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరు: బతుకమ్మల వద్ద కోలాటమాడుతున్న మహిళలు



సత్తుపల్లిటౌన్: సింగరేణి క్వార్టర్స్‌లో..



వైరారూరల్: బతుకమ్మలతో ఐసీడీఎస్ సిబ్బంది



బోనకల్‌లో..



సత్తుపల్లి విశ్వశాంతిలో..

వీఎస్ తండాలో డిజిటల్ హెల్త్‌కార్డు సర్వే

కల్లూరురూరల్: మండలంలోని వాచ్యనాయక్‌తండాలో రెండో రోజు డిజిటల్ హెల్త్ కార్డు సర్వే నిర్వహించారు. ఈ సర్వే కోసం నాలుగు టీంలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, డిప్యూటీ తహసీల్దార్ జంగా బాబ్జీ ప్రసాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తల్లాడ డిప్యూటీ తహసీల్దార్ వనజ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. నూటికి నూరుశాతం గిరిజనులు ఉన్న వాచ్యనాయక్‌తండాలో సుమారు 1,000 వరకు జనాభా.. 225 నివాస గృహాలు ఉన్నాయి. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించారు.

కల్లూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

కల్లూరు: మండలంలోని కేసీఆర్‌నగర్‌లో.. నెహ్రు యువ కేంద్ర ఆధ్వర్యంలో యూత్ క్లబ్ సభ్యులు ప్రభుత్వ జూనియర్ కళాశాల కల్లూరు విద్యార్థులతో కలిసి శుక్రవారం కళాశాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మై భారత్ లోగో కలిగిన పెన్, నోట్ పుస్తకాలు, క్యాప్ ఇచ్చి పరసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెహ్రు యువకేంద్ర అకౌంట్స్ మరియు ప్రోగ్రాం ఆఫీసర్ కమ్మర్తపు భానుందచర్, కేసీఆర్ నగర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరభద్రం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

ముదిగొండ: మండలంలోని గంధసిరిలోని వరి, మిరప, పత్తి పొలాలను మధిర ఏడీఏ విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. అధిక వర్షాలకు పత్తిలో రసం పీల్చు పురుగులు, గులాబీ రంగు పురుగులు ఆశించినట్లు గుర్తించారు. రసం పీల్చు పురుగు, గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కోలాటం కర్రల వితరణ

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళలకు కోలాటం కర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీ దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, దగ్గుల ప్రభాకర్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నాయకుడు మృతి

కొణిజర్ల: కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు చింతల మల్లయ్య శుక్రవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని టీడీపీ నాయకులు తాతా సుధాకర్‌రావు, చింతల మురళి, దామా శ్రీను, ఓర్సు ఆంజనేయులు, సత్యం, నగేష్, నరసింహారావు, ముత్తయ్య, గోవర్ధన్, వెంకటయ్య, శ్రీను తదితరులు సందర్శించి టీడీపీ జెండా కప్పి నివాళులు అర్పించారు.

నోటీసులు పట్టించుకోకపోవడంతో అడ్డుకున్నారు..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ ఆడేందుకు గ్రామ కార్యదర్శి నుండి అనుమతి తీసుకోకపోవడం వల్లే పోలీసులు ఆడనివ్వలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజులదేవరపాడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి జీపీ కార్యాలయంలో నోటీసు పెట్టినా పట్టించుకోకపోవడంతో మాజీ జెడ్పీటీసీ శీలం కవిత, తదితరులను ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. అంతేతప్ప ఇందులో రాజకీయాలు లేవని తెలిపారు. నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, యరమల పూర్ణచంద్రారెడ్డి, నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బతకమ్మకు అనుమతి కావాలా ?

ఆడపడుచులు సంప్రదాయరీతిలో జరుపుకునే బతుకమ్మ సంబరాలకు అనుమతి తీసుకోవాలా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు ప్రశ్నించారు. మండలంలోని భీమవరంలో ఆయన మాట్లాడుతూ మాజీ జెడ్పీటీసీ కవిత, తదితరులు జీపీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతుంటే కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. కలెక్టర్ నుండి అనమతి తీసుకున్నా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, రామకోటేశ్వరరావు, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డ్, మండడపు చినబాబు, సంక్రాతి కృష్ణారావు, సగ్గుర్తి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగాయత్రీదేవిగా అమ్మవారు

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి.. నైవేద్యాలు పెట్టారు. అనంతరం శ్రీ గాయత్రీదేవి అవతారం యొక్క విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



మధిర: గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



తల్లాడలో..



బోనకల్ ఎస్టీ తండాలో..



చింతకాని: మత్కేపల్లిలో..



కొణిజర్లలో..



పెనుబల్లి: కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



సత్తుపల్లిటౌన్: విశ్వజ్ఞానపీఠంలో..